మహానగరం మరింత విశాలం

250కి పెరగనున్న జీసీసీ వార్డుల సంఖ్య ● శివారు ప్రాంతాల్లోని 50 పంచాయతీల విలీనం

పెరంబూర్, మే 13: గ్రేటర్ చెన్నై మరింత విస్తరించనుంది. రోజురోజుకు పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా, మౌలిక సదుపాయాల కల్పనకు తగినట్లుగా మరిన్ని వార్డులు ఏర్పాటు చేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ఇందుకోసం నగర శివారు ప్రాంతాల్లోని మరో 50 పంచాయతీలను జీసీసీలో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో నగరంలో వార్డుల సంఖ్య 200 నుంచి 250కి పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. జీసీసీ పరిధిలో 200 వార్డులతో పాటు శివారు ప్రాంతాల్లోని 8 శాసనసభ నియోజకవర్గాలున్న విషయం తెలిసిందే. తాజాగా శివారు ప్రాంతాల్లోని 50 పంచాయతీలు జీసీసీలో విలీనం చేస్తే వార్డుల సంఖ్య 250కి పెరగడంతో పాటు శాసనసభ వారీగా మండలాల సంఖ్య కూడా పెరగనుంది. దీనికి సంబంధించి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇవి పూర్తయితే ఈ ఏడాది చివరి నాటికి అధికారికంగా ప్రకటన రావడం ఖాయంగా కనిపిస్తోంది.

చెన్నై కార్పొరేషన్ 174 చ.కి.మీ విస్తీర్ణంతో 155 వార్డులతో 10 మండలాలుగా వుండేది. శివారు ప్రాంతాల్లోని 9 పంచాయతీ యూనియన్లు, 25 పంచాయతీలను కలుపుతూ 424 చ.కి.మీ మేర 2011లో కార్పొరేషన్ పరిధిని విస్తరించారు. అప్పటి నుంచి 200 వార్డులు, 15 మండలాలతో కార్పొరేషన్ పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, విస్తరించిన కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ సరిహద్దులను చెన్నై జిల్లాలో విలీనం చేశారు. ఆ ప్రకారం, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలు చెన్నై జిల్లాలో చేర్చారు. అలాగే, శివారు ప్రాంతాల్లోని స్థానిక సంస్థలను కలుపుకొని తాంబరం, ఆవడి కార్పొరేషన్లు ఆవిర్భవించాయి.

చెన్నై కార్పొరేషన్ పరిధిలో 22 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. నగర జనాభా సంఖ్య పెరగడం, సత్వర సేవలు, నిర్వహణ సౌలభ్యం తదితర కారణాలతో శాసనసభ నియోజకవర్గాలు ప్రామాణికంగా, మండలాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. షోలింగనల్లూర్ నియోజకవర్గంలో రెండు మండలాలున్నాయి. ఇలాగే, మిగిలిన నియోజకవర్గాల గణాంకాల ప్రకారం, ప్రస్తుతమున్న 15 మండలాలను 23 మండలాలుగా విభజించి గత ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. అయితే ఆ మేరకు ఒకే నియోజకవర్గంలో ఇద్దరు మండల అధ్యక్షులు ఉండాలని, నిర్వహణ రీత్యా నిధులు కేటాయించాల్సి రావడం తదితర కారణాలతో మండలాల విభజన తాత్కాలికంగా విరమించుకున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై కార్పొరేషన్ సరిహద్దులు మళ్లీ పెంచాలని నిర్ణయించారు. చెంగల్పట్టు జిల్లాలోని తిరుపోరూర్, షోలింగనల్లూర్, తిరువళ్లూర్ జిల్లాలోని మధురవాయల్, పూందమల్లి, మాధవరం, పొన్నేరి, కాంచీపురం జిల్లాలోని ఆలందూర్, శ్రీపెరుంబుదూర్ తదితర నియోజకవర్గాల్లోని 50 పంచాయతీలను విలీనం చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... చెన్నై కార్పొరేషన్ సమీపంలోని పంచాయతీలు బాగా అభివృద్ధి సాధించాయన్నారు. అందుకు అనుగుణంగా మౌలికవసతుల కల్పన, అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. అందుకోసం, 8 నియోజకవర్గాల్లోని 50 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేసి 250 వార్డులకు పెంచాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతమున్న వార్డుల విస్తీర్ణం, వార్డులోని జనాభా సంఖ్య ఆధారంగా పునర్విభజన జరుగనుందని తెలిపారు.

తాంబరం, ఆవడి విస్తరణ

చెన్నై లాగే తాంబరం, ఆవడి కార్పొరేషన్ల పరిసరాల్లోని పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్ పరిధిని విస్తరించనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడనుందని అధికారులు తెలిపారు.

చెన్నైలో కలువనున్న పంచాయతీలు...

తిరుపోరూర్: నావలూరు, తాళంబూర్, సిరుసేరి, పుదుపాక్కం, కానత్తూర్, ముట్టుకాడు, కోవలం

షోలింగనల్లూర్: మేడవాక్కం, పెరుంబాక్కం, నన్మంగళం, కోవిలంబాక్కం, సిత్తలపాక్కం, వెంగైవాసల్, ఒట్టియంబాక్కం

ఆలందూర్: మూవరసంపట్టు, అయ్యప్పన్‌తాంగల్, కోలబాక్కం, కెరుగంబాక్కం, భరణిపుదూర్, మౌలివాక్కం, తరపాక్కం, కోవూరు, పెరియపనిచేరి, ఇరండాంకట్టలై, తండలం.

శ్రీపెరుంబుదూర్: మలయంబాక్కం, కేరళచేరి, కొళిమునివాక్కం

మధురవాయల్: వానగరం, అడయాలంపట్టు, అయ్యాపాక్కం

పూందమల్లి: కాట్టుపాక్కం, సెన్నీర్‌కుప్పం, నజరేత్‌పేట, పెంబూర్, అగరంమేల్, వరదరాజపురం, పారివాక్కం

మాధవరం: అన్నంబేడు, వెల్లానూర్, మోరై, వడకరై, గ్రాండ్ లైన్, పుల్లి లైన్, తీర్థకరయంపట్టు, విలాంగాడుపాక్కం, అలింజివాక్కం, సెంబరంబాక్కం

పొన్నేరి: విచూర్, వెల్లివాయల్ చావడి.



అన్నింటికీ ఒకేసారి ఎన్నిక?

జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు 2019 డిసెంబరులో జరిగాయి. కాంచీపురం జిల్లాను విభజించి కొత్తగా ఏర్పాటు చేసిన చెంగల్పట్టు జిల్లా సహా 9 జిల్లాలకు 2021 అక్టోబరులో స్థానిక ఎన్నికలు జరిగాయి. చెన్నై జిల్లా సమీపంలోని తిరువళ్లూర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారు 2020 జనవరిలో ప్రమాణం చేశారు. కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో గెలుపొందిన స్థానిక సంస్థల ప్రతినిధులు 2021 అక్టోబరులో పదవీ ప్రమాణం చేశారు. వీరి పదవీకాలం ఐదేళ్లు. అలాగే, 27 జిల్లాలు, 9 జిల్లాలు వేర్వేరుగా నిర్వహించినా, రెండింటి మధ్య తేడా 21 నెలలుంది. అందువల్ల ఈ వ్యత్యాసం మార్చి, సక్రమంగా ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వచ్చే ఏడాది, 27 జిల్లాల్లోని స్థానిక సంస్థల పదవీకాలం ముగియనుంది. అందుకు ముందుగానే, రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ సమయంలోనే చెన్నై కార్పొరేషన్‌తో కొత్త పంచాయతీల విలీనం ప్రకటన వెలువడే అవకాశముందని కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి.



ఉత్సాహంలో విద్యార్థులు

సీబీఎస్‌ఈ ఫలితాల వెల్లడి

● చెన్నై జోన్‌లో 98.47 శాతం ఉత్తీర్ణత

అడయార్, మే 13: సీబీఎస్‌ఈ ప్లస్‌టూ ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో చెన్నై జోన్‌లో 98.47 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 18417 పాఠశాలలకు చెందిన 16,21,224 మంది విద్యార్థినీ విద్యార్థులు 7126 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాశారు. వీరిలో 14,26,420 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం 87.98 శాతం ఉంది. గత యేడాదితో పోల్చితే ఈ యేడాది 0.65 శాతం ఉత్తీర్ణత పెరిగింది. జాతీయ స్థాయిలో ఉత్తీర్ణలో చెన్నై జోన్ మూడో స్థానంలో నిలిచింది. ఈ జోన్‌లో మొత్తం 98.47 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 99.91 శాతం ఉత్తీర్ణతో తిరువనంతపురం జోన్ మొదటి స్థానంలో ఉండగా, 99.04 శాతం ఉత్తీర్ణతతో విజయవాడ జోన్ రెండో స్థానంలో నిలిచింది. చెన్నై జోన్‌లో చెన్నై, పుదుచ్చేరి, లక్ష్యదీప్, అండమాన్ అండ్ నికోబార్ దీవులున్నాయి. ఈ ఫలితాలపై సీబీఎస్‌ఈ అధికారులు స్పందిస్తూ, పరీక్షల్లో బాలురు కంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బాలిక ఉత్తీర్ణతా శాతం 91.52 శాతంగా ఉంది. అదేవిధంగా 24068 మంది విద్యార్థులు 95 శాతం మార్కులు సాధించారు. 90 శాతం మార్కులను లక్షా 145 మంది విద్యార్థులు సాధించారని వారు వివరించారు. అదేవిధంగా సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షా ఫలితాలు కూడా సోమవారం విడుదలయ్యాయి.



మిఠాయిలు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

ఎంపీ సెల్వరాజు కన్నుమూత

● సీఎం సహా పలువురి సంతాపం



సెల్వరాజు (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం లోక్‌సభ సభ్యుడు, సీపీఐ రాష్ట్ర నిర్వాహక కమిటీ సభ్యుడు కామ్రేడ్ ఎం.సెల్వరాజు(67) మృతి చెందారు. అనారోగ్యంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెల్వరాజు సోమవారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. సెల్వరాజు మృతి పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పీఎంకే నేత అన్బుమణి తదితర నాయకులు సంతాపం ప్రకటించారు. తిరువారూరు జిల్లా నీడామంగళం సమీపంలోని కప్పలుడాయన్ ప్రాంతంలో 1957లో జన్మించిన సెల్వరాజు యుక్త వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరారు. విద్యార్థి, యువజన సంఘాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత జిల్లా శాఖ కార్యదర్శిగా, తంజావూరు జిల్లా కమిటీ సభ్యుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు, జాతీయకమిటీ సభ్యుడిగా పలు పదవులు నిర్వర్తించారు. ఆ తర్వాత నాగపట్టినం జిల్లా కార్యదర్శిగా పార్టీకి ఎనలేని సేవలు చేశారు. 1989లో నాగపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 1996, 1998, 2019లో జరిగిన ఎన్నికల్లోనూ నాగపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి వరుసగా గెలిచారు. మూత్రాశయ సమస్యల కారణంగా ఇటీవల కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్నారు. ఆ నేపథ్యంలో ఉన్నట్టుండి తీవ్ర అనారోగ్యానికి గురై నగరంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేశారు. సోమవారం వేకువజాము చికిత్స ఫలించక మృతిచెందారు. ఆయనకు కమవదనం అనే భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సెల్వరాజ్ భౌతికకాయాన్ని నగరం నుంచి ఆయన స్వస్థలానికి తీసుకెళ్ళారు. సెల్వరాజ్ మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

సీఎం స్టాలిన్ సంతాపం...

కామ్రేడ్ సెల్వరాజ్ మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని, ఐదు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీకి సేవలందించి అట్టడుగు వర్గాల ప్రజల కోసం పాటుపడిన సెల్వరాజ్ మృతి సీపీఐకి తీరని లోటని సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ నాలుగుసార్లు నాగపట్నం నియోజకవర్గం నుంచి వరుసగా ఎంపీగా గెలిచిన సెల్వరాజ్‌కు తనపై ఎనలేని అభిమానమన్నారు. గత ఆగస్టులో సెల్వరాజ్ ఇంట జరిగిన వివాహవేడుకల్లో తాను పాల్గొన్నట్లు తెలిపారు. సెల్వరాజ్ మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు, సీపీఐ నేతలకు, నాగపట్టినం నియోజకవర్గం ప్రజలకు స్టాలిన్ ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

టీవీకే జెండా, చిహ్నం రూపకల్పనలో విజయ్ బిజీ

● మదురై మహానాడులో కొత్త కార్యవర్గం

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, ప్రముఖ సినీనటుడు విజయ్ మదురైలో జూన్ 22న నిర్వహించనున్న పార్టీ తొలి మహానాడు ఏర్పాట్లపై దృష్టిసారించారు. ప్రస్తుతం పార్టీ పతాకం, చిహ్నం రూపొందించే పనుల్లో బిజీగా ఉన్నారు. విజయ్ జన్మదిన వేడుకలు, పది, ప్లస్-2 తరగతుల్లో ఉత్తీర్ణులైనవారికి సహాయాల పంపిణీ, పార్టీ కొత్త కార్యవర్గాలను పరిచయం చేయడం కోసం మదురైలో భారీ స్థాయిలో మహానాడు నిర్వహించనున్నారు. పార్టీలో రెండు కోట్ల మందికి సభ్యత్వం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 80లక్షల మంది చేరినట్లు విజయ్ గతంలోనే ప్రకటించారు. అదే సమయంలో మదురైలో నిర్వహించనున్న మహానాడుకు కనీసం రెండు కోట్ల మందిని తరలించాలని పార్టీ నిర్వాహకులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. గత ఫిబ్రవరి రెండున విజయ్ తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన విషయం విదితమే. ఆ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా గుర్తింపు కూడా పొందారు. ఆ సమయంలో త్వరలో పార్టీ పతాకం, గుర్తు అధికారికంగా వెల్లడిస్తామని విజయ్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకూ పార్టీ పతాకం గురించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆయన అభిమానులు అయోమయం చెందుతున్నారు. అదే సమయంలో రెండు రోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం విజయ్ రాజకీయ పార్టీకి సంబంధించిన వివరాలను అధికారికంగా విడుదలచేసింది. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు పేరు జోసెఫ్ విజయ్ అని పేర్కొంది. ఇక జూన్ 22న విజయ్ తన పుట్టినరోజు వేడుకలను పార్టీ మహానాడు పేరుతో అట్టహాసంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మదురైలో మహానాడు నిర్వహించే పార్టీలు రాజకీయపరంగా బాగా అభివృద్ధి చెందుతాయనే భావన వల్లే విజయ్ ఆ నగరాన్ని తన పార్టీ మహానాడుకు ఎంచుకున్నారని టీవీకే వర్గాలు పేర్కొంటున్నాయి.



అన్నామలైపై విచారణకు అనుమతివ్వలేదు

● రాజ్‌భవన్ ప్రకటన

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై విచారణ జరిపేందుకు తామెలాంటి అనుమతి ఇవ్వలేదని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. నగరంలో ద్రావిడ కళగం నిర్వహించిన సనాతన ధర్మ వ్యతిరేక మహానాడులో మంత్రి ఉదయనిధి ప్రసంగించడం, ఆ సభలో దేవాదాయ మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొనటంపై నిరసన వ్యక్తం చేస్తూ సెప్టెంబర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆ ధర్నాలో ప్రసంగించిన అన్నామలై మాజీ ముఖ్యమంత్రి దివంగత అన్నాదురై, స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తురామలింగదేవర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇరు మతాల మధ్య చిచ్చు రగిల్చేలా ప్రసంగించిన అన్నామలైపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సేలంకు చెందిన ప్యూష్ మానుష్ సేలం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సేలం జిల్లా కలెక్టర్ గవర్నర్ అనుమతి కోరారు. ఆ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా అన్నామలైపై కేసు విచారణకు గవర్నర్ ఆర్ఎన్ రవి అనుమతించారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేసు నమోదు చేసిందని ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై క్రిమినల్ కేసు నమోదైన సమాచారం కూడా గవర్నర్‌కు తెలియదని, ప్రసారమాధ్యమాల్లో వచ్చినట్లు ఆయనపై విచారణకు గవర్నర్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది.



ధ్వజస్తంభ మండపంలో స్వామివారికి దీపారాధన



ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు, శైవపండితులు

వడపళని మురుగన్ ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం వడపళని మురుగన్ ఆలయంలో సోమవారం ఉదయం వైకాశి విశాఖ ఉత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ ఉత్సవాల ప్రారంభంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మూషిక వాహన ఊరేగింపు జరిగింది. సోమవారం ఉదయం ఉదయం ఆరు గంటలకు ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు, శైవ పండితులు మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభంపై ధ్వజ పతాకాన్ని ఎగురవేశారు. రాత్రి ఏడుగంటలకు వళ్ళి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారు ఆలయ వీధులలో ఊరేగారు. ఈ నెల 21 వరకు రోజూ ఉదయం ఏడుగంటలకు మంగళగిరి విమాన సేవ, ఉదయం, సాయంత్రం యాగశాల పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాల్లో స్వామివారు విహరించనున్నారు. ఈ నెల 15 రాత్రి ఏడు గంటలకు మేషవాహనంలో, 16 నాగవాహనంలో స్వామివారు ఆలయ వీధుల్లో ఊరేగనున్నారు. ఈ నెల 17 పంచమూర్తుల ఊరేగింపు, 18న గజవాహనంలో స్వామివారి ఊరేగింపు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 19న జరుగుతుంది. వైకాశి విశాఖ దినమైన ఈ నెల 22 ఉదయం తొమ్మిది గంటలకు వళ్ళి, దేవసేన సమేతుడైన షణ్ముఖస్వామివారు పుర వీధుల్లో ఊరేగనున్నారు. అదే రోజు సాయంత్రం ఆరుగంటలకు మయూరవాహనంలో ఊరేగింపు తర్వాత తిరుకళ్యాణోత్సవం జరుగనుంది.

జయకుమార్ మృతి వ్యవహారం... అవసరమైతే స్పీకర్‌ను విచారిస్తాం

● దక్షిణ మండల ఐజీ కన్నన్

పెరంబూర్, మే 13: తిరునల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ నేత కేపీకే జయకుమార్ ధనసింగ్ అనుమానాస్పద మృతికి సంబంధించిన కేసులో అవసరమైతే అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావును విచారిస్తామని దక్షిణ మండల ఐజీ కన్నన్ తెలిపారు. తిరునల్వేలి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు శాఖ ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం ఐజీ కన్నన్ మీడియాతో మాట్లాడుతూ... జయకుమార్ ధన్‌సింగ్ కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసిన సమయంలో రెండు లేఖలు అందించారన్నారు. అందులో మరణ వాంగ్మూలమంటూ జిల్లా డీఎస్పీకి ఇచ్చినట్లు పేర్కొన్నారని, అయితే ఆ ఫిర్యాదు డీఎస్పీకి అందలేదని తెలిపారు. రెండో లేఖలో నగదు ఇచ్చిన వారి గురించి, రాజకీయ వ్యవహారాలున్నాని తెలిపారు. మొదటి లేఖలో ప్రాణహాని ఉన్నట్లుందన్నారు. జయకుమార్ మృతదేహం లభ్యమైన తర్వాత 10 మంది డీఎస్పీల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి విచారణ చేపట్టామన్నారు. పోస్టుమార్టం నివేదిక ఇంకా పూర్తిగా అందలేదని, అందిన తొలి రిపోర్ట్ ప్రకారం హత్య చేసినట్లుందని తెలిపారు. జయకుమార్ లేఖలో పేర్కొన్న 32 మందిని విచారించామన్నారు. ఈ కేసులో ఇంకా వాస్తవాలు తెలియరాలేదని, అందువల్ల అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామన్నారు. ఈ కేసులో నగదు, రాజకీయాలకు సంబంధించిన అంశాలున్నాయని, అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని తెలిపారు. హత్యకు గురైన జయకుమార్‌కు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావు మధ్య సమస్యలున్నట్లు తెలిసిన నేపథ్యంలో, స్పీకర్‌ను విచారిస్తారా అనే ప్రశ్నకు ఐజీ స్పందిస్తూ... లేఖలో ఆయన పేరుందని, అవసరమైతే ఆయనను విచారిస్తామని ఐజీ తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ కన్నన్

సమాచార దృశ్మని

నేడు జిల్లాకు సెలవు

వేలూరు, మే 13: గుడియాత్తం డివిజన్, నగర ప్రాంత ప్రధాన కేంద్రంలో ప్రసిద్ధిచెందిన గంగమ్మ ఆలయ శిరస్సు ఊరేగింపు మంగళవారం జరుగనున్నాయి. ఈ వేడుకల్లో జిల్లా సహా పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ వేడుకల సందర్భంగా జిల్లాకు సాధారణ సెలవు ప్రకటిస్తూ అందుకు బదులుగా ఈ నెల 22వ తేది శనివారం పనిదినంగా ఉంటుందని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రకటన విడుదల చేశారు.

కూడన్‌కుళంలో నిలిచిన విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మే 13: తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళం రెండో అణు ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. కూడన్‌కుళంలో 1,000 మెగా వాట్ల సామర్థ్యంతో రెండు అణు ప్లాంట్లున్నాయి. అలాగే, 3,4వ ప్లాంట్ల నిర్మాణపనులు 70 శాతం పూర్తికాగా, 5,6 ప్లాంట్ల నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. వీటితో మొదటి, రెండు అణు ప్లాంట్ల మరమ్మతుల కోసం అప్పుడప్పుడూ ఉత్పత్తి నిలిపివేస్తుంటారు. ఆ ప్రకారం, రెండో ప్లాంట్‌లో ఇంధనం నింపడం, సంవత్సరాంతం మరమ్మతుల కోసం సోమవారం ఉదయం ఉత్పత్తి నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

పూండి నుంచి పుళల్‌కు నీరు విడుదల

ఐసిఎఫ్, మే 13: తాగునీటి అవసరాలకు పూండి జలాశయం నుంచి పుళల్ జలాశయానికి ఆదివారం నీటిని విడుదల చేశారు. ఆదివారం గణాంకాల ప్రకారం 3,231 ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పూండి జలాశయంలో 733 మిలియన్ ఘనపుటడుగుల నీరుంది. పుళల్ జలాశయానికి సెకనుకు 200 ఘనపుటడుగుల నీరు విడుదల చేశారు. పుళల్ జలాశయం మొత్తం సామర్థ్యం 3,300 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం నీటినిల్వలు 2,864 మిలియన్ ఘనపుటడుగు లుంది. తాగునీటి అవసరాలకు 249 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు.

హజ్ యాత్రికులకు టీకాలు

పెరంబూర్, మే 13: రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలకు పోలియో, బ్రెయిన్ ఫీవర్ తదితర నిరోధక టీకాలు వేయనున్నారు. 65 ఏళ్ల దాటిన వారికి టీకాలు వేసేలా ప్రత్యేక ఏర్పాటుచేపట్టారు. జిల్లాల్లోని ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో సోమవారం నుంచి 18వ తేది వరకు, చూలైలో ఉన్న తమిళనాడు హజ్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేది వరకు టీకాలు వేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

పెరిగిన వాటర్ క్యాన్ల విక్రయాలు

ఐసిఎఫ్, మే 13: వేసవి కారణంగా నగరంలో తాగునీటి క్యాన్ల విక్రయాలు పెరిగాయి. నగరంలో తాగునీటి అవసరాలు పెరగడంతో మెట్రోవాటర్ బోర్డు లారీల ద్వారా సరఫరా చేస్తుండగా, మరోవైపు పైప్ లైన్ ద్వారా సరఫరా అవుతోంది. గృహాలు మాత్రమే కాకుండా ఆస్పత్రులు, కార్యాలయాలు, వాణిజ్య కాంప్లెక్స్ తదితరచోట్ల క్యాన్ వాటర్ వినియోగం పెరిగింది. ఈ విషయమై రాష్ట్ర క్యాన్ వాటర్ ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు షేక్‌స్పియర్ మాట్లాడుతూ...తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల నుంచి తరలించే బోరు నీటిని శుద్ధీకరించిన క్యాన్ వాటర్‌గా విక్రయిస్తున్నామని తెలిపారు. సాధారణంగా రోజుకు 2 కోట్ల లీటర్ల నీరు విక్రయిస్తుండగా, ఎండల కారణంగా అదనంగా మరో కోటి లీటర్లు విక్రయమవుతున్నాయని తెలిపారు.

పెరిగిన కూరగాయల ధరలు

ఐసిఎఫ్, మే 13: ఎండల కారణంగా దిగుబడి తగ్గడంతో కూరగాయల ధరలు పెరిగాయి. కోయంబేడు మార్కెట్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు దిగుమతవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు తక్కువ లోడుల్లో కూరగాయలు దిగుమతి కావడంతో కిలో బీన్స్ రూ.50 నుంచి రూ.180, వెల్లుల్లి రూ.150 నుంచి రూ.350, నిమ్మ రూ.70 నుంచి రూ.190, ఉల్లి రూ.20 నుంచి రూ.30, టమోటాలు రూ.20 నుంచి రూ.40, బీట్‌రూట్ రూ.25 నుంచి రూ.50, ముల్లంగి రూ.15 నుంచి రూ.30 ఇలా అన్నిరకాల కూరగాయల ధరలు రెండింతలు పెరిగాయి.

ఈసీఆర్ మీదుగా అదనపు బస్సులు

ఐసిఎఫ్, మే 13: ఈసీఆర్ రోడ్డు మీదుగా ఇతర ప్రాంతాలకు అదనంగా 100 బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు. కోయంబేడు బస్టాండ్ నుంచి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు మీదుగా మైలాడుదురై, నాగపట్టణం, వేలాంకన్ని, పుదుచ్చేరి, కడలూరు, చిదంబరం వరకు ప్రభుత్వ బస్సులు నడుస్తున్నాయి. అదే విధంగా పూందమల్లి మీదుగా కాంచీపురం, ఆర్కాడు, వేలూరు, హోసూరు, బెంగళూరు వంటి ప్రాంతాలకు నడుపుతున్న బస్సుల్లో ప్రతిరోజు వేలాది మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కిలంబాక్కం కొత్త బస్ టెర్మినల్ ప్రారంభించిన అనంతరం ఈసీఆర్ రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో వారి సౌకర్యార్థం కోయంబేడు నుంచి ఈస్ట్‌కోస్ట్ మీదుగా ఇదివరకే నడుపుతున్న 200 బస్సులతో పాటు అదనంగా మరో 100 బస్సులు నడుపనున్నామని ప్రభుత్వ రవాణా సంస్థ అధికారులు తెలిపారు.

900 ప్రభుత్వ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు

ప్యారీస్, మే 13: ఫుట్ బోర్డు ప్రయాణానికి అడ్డుకట్ట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు సిటీ బస్సుల్లో ఫుట్ బోర్డుపై నిల్చొని ప్రయాణం చేయడం వల్ల జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తొలివిడతగా 900 ఎంటీసీ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేసింది. నగరంలో ఎంటీసీ సంస్థ ప్రస్తుతం 3,100 సిటీ బస్సులు నడుపుతోంది. 629 రూట్లలో నడుపుతున్న ఈ బస్సుల్లో రోజుకు సుమారు 29 లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. కాగా, ఆటోమేటిక్ డోర్లు లేని ఎంటీసీ బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని అన్ని డిపోల మేనేజర్లకు రాష్ట్రప్రభుత్వం సోమవారం ఆదేశించింది.

సెలూన్‌లో అంటరానితనం

తండ్రీకొడుకుల అరెస్టు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా ఆరూరు సమీపం కీరపట్టి గ్రామంలోని ఓ సెలూన్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థికి కటింగ్ చేయడానికి నిరాకరించి ఆ సెలూన్ నిర్వాహకులైన తండ్రీకొడుకులను పోలీసులు అరెస్టు చేశారు. వారిపై అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ సెలూన్‌ను యోగేశ్వరన్, అతడి తండ్రి కరుప్పన్ నడుపుతున్నారు. రెండు రోజుల క్రితం కొళ్ళప్పారై గ్రామానికి చెందిన 17 యేళ్ల విద్యార్థి క్రాపు చేయించుకోవడానికి సెలూన్‌కు వెళ్లాడు. యోగేశ్వరన్ ఆ విద్యార్థి ఊరిపేరు, కులం అడిగి తెలుసుకున్నాక, తమ దుకాణంలో కటింగ్ చేయడం కుదరదంటూ పంపేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ విద్యార్థి స్నేహితులు సెలూన్‌షాప్ వద్దకు వెళ్ళి కరుప్పన్‌ను ప్రశ్నించగా, ఆ కులానికి చెందినవారికి తమ దుకాణంలో కటింగ్ చేయటం కుదరదని తేల్చి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆ విద్యార్థి, స్నేహితులు కలిసి ఆరూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసుకుని సెలూన్‌షాపు నడుపుతున్న కరుప్పన్, అతడి కుమారుడు యోగేశ్వరన్‌ను అరెస్టు చేశారు.

వైభవంగా జడమునీశ్వరాలయ వార్షిక వేడుకలు

వేలూరు, మే 13: కాట్పాడి-గుడియాత్తం రోడ్డు సమీపం రైల్వే దళంలో ఉన్న పచ్చయమ్మాళ్ వేపచెట్టులో ఉన్న జడమునీశ్వరుని ఆలయ 7వ వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జడమునీశ్వరునికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వేలూరు కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్, ఆయన భార్య సరస్వతి పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాట్పాడి కామరాజనగర్ బాలమురుగన్, డీఎంకే కాట్పాడి నార్త్ ప్రాంత ప్రతినిధి నాయుడు బాబు, కేఎస్సీ కవిఅరసన్, ఆలయ పూజారి బాబూజీ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

అగ్నిమాపక వాహనాలకు నీటి కొరత

వేలూరు, మే 13: వాణియంబాడిలో తోళ్ల పరిశ్రమలు, టింబర్ డిపోలు కర్మాగారాలు, గోదాములు లక్షల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవించి లక్షల్లో ఆస్తినష్టం సంభవిస్తోంది. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపం కోనామేడు ప్రాంతంలో ఏజాస్, ఇర్ఫాన్ మొదలైన వారికి టింబర్ డిపోలు, తోళ్ల పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమ వెనుక వైపు గిడ్డంగి ఉంది. ఈ నేపథ్యంలో, తోళ్ల పరిశ్రమ వెనుక వైపున్న ఏరికరైలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు పరిశ్రమ వెనుక వైపున్న ప్లాస్టిక్ వస్తువుల గోదాముకు విస్తరించాయి. దీంతో, ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. చుట్టుపక్కల వారు వాణియంబాడి అగ్నిమాపక సిబ్బందికివెంటనే సమాచారం ఇవ్వగా, అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. ఈలోగా వాహనంలో నీరు అయిపోవడంతో ఆంబూరు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. వాహనంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పుతున్న సమయంలో ఆ వాహనంలో కూడా నీరు అయిపోయింది. దీంతో, ట్రాక్టర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి మంటలు అదుపుచేశారు. అంతలోనే లక్షలాది రూపాయల విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి.



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సిరుచ్చేరి-కిలంబాక్కం పథకం ఉపసంహరణ

ఐసిఎఫ్, మే 13: సిరుచ్చేరి-కిలంబాక్కానికి బదులుగా కేలంబాక్కం, తిరుప్పోరూర్ మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో మెట్రోరైలు నడపడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. నగరంలో తొలివిడతగా వాషర్‌మెన్‌పేట నుంచి విమానాశ్రయం వరకు మొదటి విడత మెట్రోపనులు పూర్తికాగా, రెండో విడత మెట్రోపనులు జరుగుతున్నాయి. కిలంబాక్కంలో కొత్త బస్టాండ్ ఏర్పాటుకావడంతో విమానాశ్రయం-కిలంబాక్కం, పందలూరు విమానాశ్రయం ఏర్పాటు చేయనుండడంతో పూందమల్లి-పరందూర్, కోయంబేడు-ఆవడికి రెండో విడత విస్తరణ చేపట్టేందుకు సీఎంఆర్ఎల్ నిర్ణయించింది. కోయంబేడు-ఆవడి, పూందమల్లి-పరందూర్ మధ్య ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో, కిలంబాక్కం-సిరుచ్చేరి మెట్రోరైలు పొడిగింపు పథకం ఉపసంహరించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీనికి ప్రత్యామ్నాయంగా కేలంబాక్కం-తిరుప్పోరూర్ మీదుగా మరో మార్గం ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని, ఇంకా నిర్ణయం ఖరారు కాలేదని అధికారులు తెలిపారు.

ద్రౌపది అమ్మన్ ఆలయంలో దుర్యోధన వధ

వేలూరు, మే 13: రాణిపేట జిల్లా షోలింగర్‌లోని ద్రౌపతి అమ్మన్ ఆలయ వేడుకల్లో 13వ రోజైన సోమవారం అగ్నిగుండం వేడుకలు జరిగాయి. అలాగే, దుర్యోధన వధ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ద్రౌపది అమ్మవారికి, అర్జునుడికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల నడుమ ఆలయ ఆవరణలో స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం దుర్యోధనుడిని భీముడు వధించే దృశ్యాలను కళాకారులు ప్రదర్శించారు.



ప్రదర్శనలో కళాకారులు

గంజాయి అమ్మకాల గురించి పోలీసులకు తెలుసు

● పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, మే 13: రాష్ట్రంలో గంజాయి విక్రయాల గురించి పోలీసులకు తెలుసని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ ఆరోపించారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో తైలాపురం గార్డెన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాందాస్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర 96 లోక్‌సభ నియోజకవర్గాలకు సోమవారం జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మెజార్టీ విజయం సాధించి మూడవ సారి మళ్లీ ప్రధాని సీట్లో మోదీ కూర్చుంటారని జోస్యం చెప్పారు. కులాలవారీగా జనగణన నిర్వహించాలని తమ పార్టీ ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తోందని, అయితే తమిళనాడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో వీధి వీధికి గంజాయి తదితర మాదకద్రవ్యాలు సులువుగా అందుబాటులో ఉన్నాయని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గంజాయి మత్తులో వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయితో పట్టుబడిన నేరస్తులను పోలీసులు మరుసటిరోజే విడుదల చేస్తున్నారని రాందాస్ ఆరోపించారు.

నృత్యాలు, కచేరీలకు అనుమతి నిరాకరణ

● హైకోర్టు అసంతృప్తి

పెరంబూర్, మే 13: ఎన్నికల కోడ్ పేరుతో ఆలయ ఉత్సవాల్లో నృత్యాలు, కచేరీలకు అనుమతులు నిరాకరించడాన్ని అంగీకరించలేము. చట్ట నిబంధనలకు లోబడి ఆలయ ఉత్సవాల్లో నృత్యాలు, కచేరీలకు అనుమతులివ్వాలని పోలీసులకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. విల్లుపురం జిల్లా పళయమరక్కాణం గ్రామంలోని మారియమ్మన్ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేది పాట కచేరీకి అనుమతివ్వాలని పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం సమర్పించగా, ఎన్నికల కోడ్ కారణంగా అనుమతించలేమని పోలీసులు తెలిపారు. దీంతో, కేశవన్ అనే గ్రామస్తుడు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది... లోక్‌సభ ఎన్నికల నిబంధనల కారణంగా కచేరీలకు అనుమతించలేదని వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వాదనపై అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం, ఎన్నికల కోడ్ పేరుతో ఆలయ ఉత్సవాల్లో కచేరీలకు అనుమతించకపోవడం అంగీకరించలేమని, ఇలాంటి కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకుంటే అనుమతించాలని పోలీసులకు న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

బాలికలపై సామూహిక అత్యాచారం

● ముగ్గురు మైనర్లు సహా 9 మంది అరెస్ట్

పెరంబూర్, మే 13: తిరుప్పూర్ జిల్లాలో ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారం చేసిన ఘటనలో ముగ్గురు మైనర్ బాలురు సహా 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉడుమలై ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక తన తాత-అవ్వ సంరక్షణలో ఉంటోంది. కొద్దిరోజులుగా బాలిక అస్వస్థతగా ఉండడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి పరీక్షించగా, నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు తెలిసింది. దీంతో, దిగ్భ్రాంతి చెందిన కుటుంబసభ్యులు ఉడుమలై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన విషయాలపై విచారించిన పోలీసులు అదే ప్రాంతానికి చెందిన జయకాళీశ్వరన్ (19), మదన్‌కుమార్ (19), భరణికుమార్ (21), ప్రకాష్ (24), నందగోపాల్ (19), బాలభారతి (22), సహా 14,15,16 ఏళ్ల మైనర్ బాలురు సహా 9 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద జరిపిన విచారణలో... ఆర్థిక సమస్యలతో ఉన్న 13 ఏళ్ల బాలికకు ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి వీరు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది.

ఏనుగు దాడిలో ఒకరి మృతి

పాకాల, మే 13: తిరుపతి జిల్లా పాకాల మండలం చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లె, పాకాల పరిసర గ్రామాల్లో అడవి ఏనుగు సోమవారం పట్టపగలే హల్‌చల్ చేసింది. మణిపిరెడ్డిపల్లె సమీపంలో ఎం.కాతవరాయన్ (52)పై దాడి చేయడంతో అతడు మృతిచెందాడు. మృతుడు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై పెరియకొలపడికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతడిపై దాడిచేశాక మణిపిరెడ్డిపల్లె సమీపంలో రైలు పట్టాలు దాటి అడుసుపల్లె, కుందేటివారిపల్లె పరిసరాల్లో సాయంత్రం వరకు ఏనుగు సంచరించింది. . మరోవైపు అటవీ అధికారులు డ్రోన్ కెమెరా, ఫోకస్ లైట్లతో ఒంటరి ఏనుగు కోసం గాలిస్తున్నారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం చెన్నై కేఎంసీ ఆస్పత్రిలో రంగవల్లికలు వేస్తున్న నర్సులు

ఏఎంఎంకే ఆధ్వర్యంలో చలివేందం ప్రారంభం

వేలూరు, మే 13: కార్పొరేషన్ జిల్లా అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) కాట్పాడి కేంద్ర యూనియన్ సెక్రటరీ బాబు సహకారంతో వల్లిమలై సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో సోవవాఆరం పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, కీరకాయలు, మజ్జిగ, శీతల పానీయాల పంపిణీ జరిగింది. ఏఎంఎంకే మండల బాధ్యుడు జి.పార్తీపన్ ప్రారంభించిన కార్యక్రమంలో ఎంజీఆర్ మండ్ర కోశాధికారి రాజ, ప్రధాన కళగ నేత సతీష్‌కుమార్, కాట్పాడి కేంద్ర యూనియన్ నిర్వాహకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న పార్తీపన్

మెట్రోరైలు ప్రాజెక్టు ఉద్యోగిపై దాడి

● గేయరచయిత వేల్‌మురుగన్ అరెస్టు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు ప్రాజెక్టు ఉద్యోగిపై దాడి చేసిన ప్రముఖ రచయిత, నేపథ్య గాయకుడు వేల్‌మురుగన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విరుగంబాక్కం ప్రాంతంలో మెట్రో రైలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనితో ఆర్కాట్‌రోడ్డును ఒన్‌వేగా మార్చారు. ఆ మేరకు శనివారం రాత్రి 11 గంటలకు విరుగుంబాక్కం ఆర్కాడు రోడ్డు వేంబులి అమ్మన్ సిగ్నల్ వద్ద బారికేడ్లు అడ్డంగా పెట్టి ఒన్‌వేగా మార్చారు. ఆ సమయంలో ఆమార్గంలో నేపథ్య గాయకుడు వేల్‌మురుగన్ కారులో వచ్చి, బారికేడ్లను తొలగించి, కారును నడిపేందుకు ప్రయత్నించారు. దానిని గమనించిన మెట్రోరైలు నిర్మాణ సంస్థ అసిస్టెంట్ సూపర్‌వైజర్ వడివేల్ అక్కడికి చేరుకుని మెట్రోరైలు పనులు జరుగుతుండటంతో వాహనాల రాకపోకలపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆ సందర్భంగా వేల్‌మురుగన్‌కు వడివేల్‌కు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వేల్‌మురుగన్ ఆగ్రహంతో నానాదుర్భాషలాడి వడివేల్‌పై దాడి జరిపాడు. దీంతో వడివేల్‌కు గాయమైంది. వడివేల్ ఫిర్యాదు మేరకు గాయకుడు వేల్‌మురుగన్‌ను విరుగంబాక్కం పోలీసులు అరెస్టు చేశారు.



వేల్‌మురుగన్

జైలులో నా ప్రాణాలకు ముప్పు

● కోవై ఆస్పత్రి వద్ద సవుక్కు శంకర్ నినాదం


చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులను కించపరిచేలా విమర్శలు చేసి అరెస్టయిన యూ ట్యూబర్ సవుక్కు శంకర్ కోయంబత్తూరు జైలులో తన ప్రాణాలకు ముప్పు వుందని ఆరోపించారు. నగరంలో సవుక్కు శంకర్‌పై గంజాయి స్మగ్లింగ్ తదితర కేసులుండటంతో గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ఆయనపై గూండా చట్టం ప్రయోగించారు. కోయంబత్తూరు జైలులో ఉన్న సవుక్కు శంకర్‌కు చెన్నై పోలీసులు ఆ ఉత్తర్వును అందజేశారు. నాలుగు రోజుల క్రితం సవుక్కుశంకర్‌ను పోలీసులు వ్యాన్‌లో కోవై తరలిస్తుండగా వ్యాన్ ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో శంకర్ చేతికి గాయమైంది. కోయంబత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయనకు చికిత్స కూడా చేయించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సవుక్కు శంకర్‌ను రెండోసారి కోయంబత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పోలీసులు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆయన 'కోయంబత్తూరు జైలులో నా ప్రాణాలకు ముప్పు' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. తన చేతిని కోయంబత్తూరు జైలు పోలీసులే విరగగొట్టారంటూ కేకలు పెట్టారు. ఆ తర్వాత ఆసుపత్రిలోకి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు చేయించారు. తర్వాత శంకర్‌ను గట్టి భద్రత మధ్య కోవై సెంట్రల్ జైలుకు తరలించారు.



సవుక్కు శంకర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళుతున్న పోలీసులు

వేలిపై హాకీ స్టిక్‌తో 6.35 గంటల సాధన

పెరంబూర్, మే 13: కాంచీపురం సమీపం తిమ్మసముద్రం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్ (39) బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. క్రీడలంటే ఆసక్తి కలిగిన ఆయన, క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అందులో, హాకీ స్టిక్‌ను ఒకే వేలిపై నిలబెట్టి బ్యాలెన్స్ చేస్తూ ఎక్కువ సమయం ఉంచాలని భావించాడు. అందుకోసం 2019 నుంచి 642 గ్రాముల బరువైన హాకీ స్టిక్‌ను వేలిపై నిలబెట్టేలా ప్రాక్టీస్ చేశాడు. ఆ క్రమంలో, గతంలో ఈ విధంగా 6 గంటల ఐదు నిముషాలు ఉంచుకొని సాధన చేశాడు. ఈ నేపథ్యంలో, మళ్లీ ఈ రికార్డు అధిగమించేలా కాంచీపురం జిల్లా క్రీడా మైదానంలోని ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 8.29 గంటలకు తన సాధన ప్రారంభించి 6 గంటల 35 నిముషాలు హాకీ స్టిక్ వేలిపై నిలబెట్టి బాలెన్స్ చేశాడు. ఈ సాధనకు గిన్నిస్ బుక్‌లో స్థానం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపాడు.



వేలిపై హాక్ స్టిక్‌తో అరుణ్‌కుమార్

పళని ఆలయంలో భక్తుల రద్దీ

పెరంబూర్, మే 13: దిండుగల్ జిల్లా పళని మురుగన్ కొండ ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేసవి సెలవుల సందర్భంగా కుటుంబాలతో వస్తున్న భక్తులు రెండు గంటల పాటు క్యూలైన్లలో వేచి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. అలాగే, కొండ ఆలయానికి వింఛ్, రోప్ కార్లలో వెళ్లేందుకు కూడా భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.



క్యూలైన్‌లో భక్తులు

నర్సుకు లైంగిక వేధింపులు

ప్రభుత్వ వైద్యుడి అరెస్టు

అడయార్, మే 13: దిండిగల్ జిల్లా వత్తలగుండు సమీపంలోని మల్లంపట్టి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీనివాసన్ (28) వైద్యుడిగా పనిచేస్తున్నారు. అయితే, ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇల్లై తేడి మరుత్తువం అనే పథకంలో నర్సుగా పనిచేస్తున్న 31 యేళ్ళ మహిళను లైంగికంగా వేధించారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వైద్యుడిని అరెస్టు చేశారు.

మూడు కిలోల గుట్కా స్వాధీనం

ప్యారీస్, మే 13: స్థానిక కొళత్తూర్‌లోని దుకాణాలకు గుట్కా పదార్థాలు సరఫరా చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, మూడు కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. కొళత్తూర్ ప్రాంతంలో ద్విచక్రవాహనంలో ఓ వ్యక్తి సిగిరెట్ దుకాణాలకు గుట్కా పదార్థాలు సరఫరా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం మారువేషాల్లో నిఘా వేశారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంలో పెద్ద బ్యాగుతో వెళుతున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేసి అందులోని మూడు కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... అతను కొళత్తూర్ కావేరినగర్‌కు చెందిన కన్నన్ (47) అని తెలిసింది. కేసు నమోదుచేసి సోమవారం కోర్టులో హాజరుపరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

ట్రాక్‌పై నిద్రపోయిన యువకులు

రైలు ఢీకొని ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఐసిఎఫ్, మే 13: నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిద్రపోయిన యువకులను రైలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వేదారణ్యం సమీపంలోని మనక్కాడు ప్రాంతంలో ఉన్న మారియమ్మన్ ఆలయంలో ఆదివారం రాత్రి జరిగిన చిత్తిరై ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. తిరుప్పూర్‌లోని బనియన్ తయారీ కంపెనీలో పనిచేసే వేదారణ్యంకు చెందిన కుమారసారథి(18), నారాయణన్ (18), ప్రభాకరన్ (18) అనే ముగ్గురు మిత్రులు సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై పడుకొని నిద్రపోయారు. సోమవారం ఉదయం 5 గంటలకు తిరుత్తురైపూండి నుంచి అగస్తియన్‌పల్లి వైపుకు వెళ్లే ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో సారథి సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనుమతి లేకుంటే గూండా చట్టం

● దురై వైగో డిమాండ్

అడయార్, మే 13: అనుమతి లేకుండా నడుపుతున్న బాణాసంచా కర్మాగార యజమానులపై గూండా చట్టం ప్రయోగించాలని ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి దురై వైగో డిమాండ్ చేశారు. శివకాశి జిల్లా సంగమలపట్టిలోని బాణాసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో 10 మంది మృత్యువాత పడగా, మరో 14 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధిత కుటుంబాలను దురై వైగో పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 9న జరిగిన పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలతో పాటు బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించి, ఓదార్చామన్నారు. సీఎం స్టాలిన్ ఆదేశం మేరకు ప్రభుత్వ అధికారులు సత్వరం స్పందించి బాధితులకు తగిన పరిహారం అందజేస్తారన్నారు. ఇలాంటి ప్రమాదాలకు ప్రధాన కారణం వాటి యజమానులే అని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా కర్మాగారాలు ప్రారంభించి, తగిన జాగ్రతలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి వారిపై గూండా చట్టం ప్రయోగించేలా చట్టాన్ని తీసుకుని రావాలని కోరుతున్నట్టు చెప్పారు.

ఆన్‌లైన్ ప్రచారం నమ్మి రూ.22 లక్షలు మోసపోయిన ఇంజనీర్లు

అడయార్, మే 13: ఆన్‌లైన్ ప్రచారాన్ని నమ్మి ఇద్దరు ఇంజనీర్లు రూ.22 లక్షల మేర మోసపోయారు. వీరి ఫిర్యాదు మేరకు మోసగాళ్ళ కోసం సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. తేని జిల్లా తెన్‌కరై ప్రాంతానికి చెందిన దాస్ (35) అనే ఇంజనీర్‌గా ఉన్నారు. షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తే లాభాలు వస్తాయంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఒక ప్రకటన చూసి... ఆ ప్రచార యాడ్‌లో ఉన్న నంబరుకు ఫోన్ చేయగా, సైబర్ నేరగాళ్ళు నమ్మించి రూ.10.92 లక్షల వరకు పెట్టుబడి పెట్టించారు.. ఆ తర్వాత తొలి దఫాగా రూ.1.93 లక్షలు పంపించిన సైబర్ నేరగాళ్ళు ఆ తర్వాత ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన దాస్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అదేవిధంగా, ఇదే జిల్లాలోని పెరుమాళ్ కోయిల్‌కు చెందిన వినోద్ (35) అనే ఇంజనీర్ కూడా ఇదే యాడ్‌ను నమ్మి రూ.10.74 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయాడు. వీరిద్దరి వద్ద సైబర్ నేరగాళ్ళు దాదాపు రూ.22 లక్షల వరకు మోసం చేశారు. ఈ రెండు మోసాలపై కేసు నమోదు చేసిన సైబర్ నేరగాళ్ళ విచారణ జరుపుతున్నారు.

దోపిడీ దొంగ అరెస్ట్

వేలూరు, మే 13: రాష్ట్రవ్యాప్తంగా వెతుకుతున్న భలే దొంగను తిరుపత్తూర్ జిల్లా జోలారుపేటలో పోలీసులు అరెస్ట్ చేశారు. జోలార్‌పేట సమీపం హైదర్ ప్రాంతానికి చెందిన కామరాజ్ ఇంట్లో గత ఏడాది ఆగస్టు 27న ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు ఐదున్నర సవర్ల నగలు దోచుకొని పరారయ్యారు. ఈ ఘటనపై కామరాజ్ భార్య వసంత తిరుపత్తూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసిన పోలీసులు దోపిడీ దొంగల కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా తిరుపత్తూర్ నగర పోలీసులు చిన్నకులం మారియమ్మన్ ఆలయ వీధి సమీపంలో వాహనతనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అటువైపు వచ్చిన యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా పొంతనలేని సమాధానాలిచ్చాడు. దీంతో, అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా, వేలూరు జిల్లా బెడుగత్తూర్ ప్రాంతానికి చెందిన ఆనందరాజ్ కుమారుడు శంకర్ (64) అని, హైదర్ నగర్ సహా తిరుప్పూర్ డివిజన్ ప్రాంతాల్లో ఆరు దొంగతనాలకు పాల్పడ్డాడని, అతనిపై రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు తెలిసింది. దీంతో అతనిని అరెస్ట్ చేసిన పోలీసులు వేలూరు జైలుకు తరలించారు.



దొంగను అరెస్ట్ చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

రైలు నుండి జారిపడిన విద్యార్థి మృతి

ప్యారీస్, మే 13: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరిన సబర్బన్ రైలు నుంచి జారిపడిన ఓ విద్యార్థి మరణించినట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. ఎన్నూర్ కామరాజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ నాజర్ కుమారుడు మహమ్మద్ నఫిల్ (17) ప్లస్ టూలో ఇటీవల ఉత్తీర్ణత సాధించి ఆవడిలోని ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లేందుకు సోమవారం ఉదయం సెంట్రల్ స్టేషన్‌కు వచ్చాడు. ఆవడికి వెళ్లే రైలు ఎక్కకుండా పొరపాటున గుమ్మిడిపూండి బయల్దేరిన రైలెక్కాడు. తప్పు తెలుసుకున్న నఫిల్ కదులుతున్న రైలు నుంచి దిగేందుకు యత్నించి ప్లాట్‌ఫారం, పట్టాల మధ్య జారిపడి తీవ్రంగా గాయపడి మరణించాడు.దీనిపైఆర్పీఎఫ్ పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.

హాస్టల్ వార్డెన్ వైఖరికి విద్యార్థుల ధర్నా

అడయార్, మే 13: హాస్టల్ వార్డెన్ వైఖరిని ఖండిస్తూ విద్యార్థులు ధర్నా చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం కొల్లంజియప్పార్ ప్రభుత్వ కాలేజీలో 400 మందికి పైగా విద్యార్థులు చదువుకున్నారు. ఈ కాలేజీకి అనుబంధ హాస్టల్‌లో విద్యార్థులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం వార్షికోత్సవ వేడుక జరిగింది. ఈ సందర్భంగా తృతీయ సంవత్సరానికి చెందిన మదివాణన్ అనే విద్యార్థిపై దాడి జరిగింది. దీంతో బాధిత విద్యార్థి విరుదాచలం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్ళాడు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్ అళగురాజా విద్యార్థికి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయకూడదని చెప్పడమేకాకుండా దుర్భాషలాడారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన విద్యార్థులు వార్డెన్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. విద్యార్థిని పరుష పదజాలంతో దూషించిన వార్డెన్‌పై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

విమానంలో మద్యం మత్తులో గలాభా

● ప్రయాణికుడిని తిప్పిపంపిన అధికారులు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌కు వెళ్లేందుకు ఐదేళ్ల కుమార్తెతో విమానమెక్కిన చెన్నై వ్యాపారి తాగిన మైకంలో గలాభా సృష్టించాడు. దీంతో అధికారులు ఆయనను విమానం నుంచి దింపి మందలించి పంపంచేశారు. గుజరాత్‌కు చెందిన ప్రవీణ్‌గాంధీ నగరంలో వ్యాపారం చేస్తున్నాడు. స్వస్థలమైన అహ్మదాబాద్‌లో జరుగనున్న వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన, ఐదేళ్ల కుమార్తెతో మీనాంబాక్కం విమానాశ్రయానికి వెళ్ళాడు. అప్పటికే ఆయన మద్యం తాగి ఉన్నాడు. అధికారులు సక్రమంగా తనిఖీ చేయకపోవడంతో ఆయన అహ్మదాబాద్ విమానంలో ఎక్కి, సీటులో కూర్చుని తోటి ప్రయాణికులతో గొడవపడసాగాడు. మద్యం మత్తులో అందరితో గొడవకు దిగాడు. ఈ విషయం తెలుసుకున్న భద్రతాధికారులు విమానంలోకి వెళ్ళి ప్రవీణ్‌గాంధీని, ఆయన కుమార్తెను కిందకు దింపారు. ఆ తర్వాత పోలీసులు అతడిని ప్రశ్నించగా స్వస్థలానికి వెళుతున్నాననే సంతోషం మద్యం ఎక్కువగా తాగానని, క్షమించమని వేడుకున్నాడు. దీంతో పోలీసులు ఆయనను మందలించి పంపేశారు. ఈ సంఘటన కారణంగా అహమ్మదాబాద్ విమానం గంట ఆలస్యంగా బయలుదేరింది.

స్కూల్ అడ్మిషన్లలోనే కులం కాలమ్ తొలగించాలి : పేరరసు

● రంజిత్ హీరోగా కొత్త చిత్రం

కేఎస్ రవికుమార్ దర్శకత్వం వహించిన 'పౌన్ విలంగు' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన రంజిత్ అనేక చిత్రాల్లో విలన్, సహాయ నటుడుగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 2003లో 'భీష్మర్' అనే చిత్రానికి తొలిసారి దర్శకత్వం వహించారు. ఇపుడు 'కుళందై కేరాఫ్ గౌండంపాళెయం' అనే పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. శ్రీపాసతాయ్ మూవీస్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో ఆల్వినా హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రల్లో ఇమాన్ అన్నాచ్చి తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో సీనియర్ దర్శకుడు, తమిళ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, కోశాధికారి పేరరసు, దర్శకుడు ప్రవీణ్ గాంధీ, స్టంట్ మాస్టర్ కణల్ కన్నన్ సహా పలువురు పాల్గొని ఆడియో రిలీజ్ చేసి, చిత్ర బృందాన్ని అభినందించారు. పేరరసు మాట్లాడుతూ, 'ప్రేమ పేరుతో నటించి ఒక మహిళను మోసం చేసి అత్యాచారం చేయడం ఒక్కటే. మహిళలను మోసం చేసేవాడిని మృగజాతికి చెందిన వ్యక్తిగా పరిగణించాలి. ఈ సినిమా ట్రైలర్ చూస్తే, ఒక తండ్రి స్థానంలో హీరో రంజిత్ ఉండి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మహిళలందరికీ కూడా ఇదే తరహా కోపం రావాలి. దర్శకుడు అనేవాడు సమాజం చైతన్యం కోసం కృషి చేయాలి. పేర్ల వెనుక ఉన్న కులాల పేర్లను ప్రభుత్వం తొలగించడం భావ్యం కాదు. ఈ పనిచేసే ముందు.. పాఠశాల అడ్మిషన్ సమయంలో కులం అనే కాలమ్ పూర్తిగా రద్దు చేయాలి' అని కోరారు. దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకు గౌండంపాళెయం అని టైటిల్ పెట్టడం వల్ల ఇది కులానికి చెందిన చిత్రంగా చూడొద్దు. నేను 'చిన్న గౌండర్' చిత్రాన్ని తెరకెక్కించిన సమయంలో ఎలాంటి సమస్యలు లేవు. పైగా ఆ చిత్రాన్ని సిల్వర్ జూబ్లీ చిత్రంగా నిలిపారు. అందువల్ల ఈ చిత్రాన్ని మరో కోణంలో చూడకుండా హిట్ చేయాలి' అని కోరారు. ఆ తర్వాత హీరో రంజిత్, హీరోయిన్ ఆల్వినా, కణల్ కన్నన్‌తో సహా యూనిట్ సభ్యులు ప్రసంగించారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి


దివ్య భారతి

మండు వేసవిలో 'బ్యాచిలర్' భామ హాట్ లుక్స్

మండు వేసవిలో 'బ్యాచిలర్ భామ హాట్ లుక్స్‌తో అదరగొడుతోంది. జీవీ ప్రకాష్ హీరోగా నటించిన 'బ్యాచిలర్ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన దివ్యభారతి.. ఆ తర్వాత వరుస చిత్రాల్లో నటించింది. తన తొలి చిత్రంలోనే ఆమె తన అందాలను ఆరబోసి అదరగొట్టడంతో తొలి చిత్రంలోనే ఆమె ఎంతో బోల్డ్‌గా నటించింది. ఆ తర్వాత సోషల్ మీడియా వేదికగా గ్లామర్ ఫొటోలను షేర్ చేస్తూ, నెటిజన్ల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారు. ఫలితంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 35 లక్షల ఫాలోవర్లను కలిగివున్నారు. ఇపుడు శ్రీలంక విహార యాత్రకు వెళ్ళిన దివ్య భారతి.. ఎక్స్‌పోజింగ్ చేస్తూ దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

కొత్త నటీనటులతో 'కుట్రం పుదిదు'

● క్లాప్‌కొట్టి ప్రారంభించిన భాగ్యరాజ్

డెబ్యూ హీరో తరుణ్, నూతన నటి సెష్విత జంటగా 'కుట్రం పుదిదు' పేరుతో ఒక కొత్త చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం ప్రారంభ పూజా కార్యక్రమం సోమవారం నగరంలో ప్రారంభమైంది. సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని క్లాప్‌కొట్టి షూటింగ్ ప్రారంభించారు. జీకేఆర్ సినీ ఆర్ట్స్ బ్యానరుపై డాక్టర్ ఎస్.కార్తికేయన్, తరుణ్ కార్తికేయన్ కలిసి భారీ బడ్జెట్‌తో ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకుడిగా పరిచయమవుతున్న రజిత్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూరుస్తున్నారు. ఇతర పాత్రల్లో మధుసూదన్ రావు, రామచంద్రన్, బాయ్స్ రాజన్, ప్రియదర్శిని, శ్రీనిధి, సంగీత తదితరులు నటిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ సెట్స్‌పైకి తీసుకెళ్ళి ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారు. ఊహలకు అతీతంగా వాస్తవిక కథాంశంతో రూపొందించే ఈ చిత్రానికి పాటలు రజిత్, గిరీష్, కెమెరా జేసన్ విలియమ్స్, నృత్య దర్శకుడు వరదా.


కొత్త చిత్రం పూజా కార్యక్రమం

నడిగర్ సంఘానికి ధనుష్ రూ.కోటి విరాళం

నడిగర్ సంఘ భవన నిర్మాణానికి హీరో ధనుష్ కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. దక్షిణ భారత నడిగర్ సంఘ సభ్యుడైన ధనుష్ భవన నిర్మాణం కోసం తన వంతు సాయం చేశారు. కోటి రూపాయల చెక్కును నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా హీరో ధనుష్‌ను నడిగర్ సంఘం తరపున నాజర్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కాగా, ఈ భవన నిర్మాణం కోసం ఇప్పటికే హీరోలు కమల్ హాసన్, ఉదయనిధి స్టాలిన్, శివకార్తికేయన్ వంటి వారు భారీగా విరాళాలను అందజేసిన విషయం తెల్సిందే. మరోవైపు, ఈ భవన నిర్మాణ పనులను ఇటీవల నాజర్ ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అన్నీ సాఫీగా సాగితే ఈ యేడాది ఆఖరునాటికి ఈ భవన నిర్మాణం పూర్తికానుంది.


ధనుష్‌ను అభినందిస్తున్న నాజర్, కార్తీ, పూచ్చి మురుగన్

వళ్లువర్‌కోట్టం.. మరింత ఆకర్షణీయం

● పర్యాటక ప్రాంతానికి నూతన సొబగులు ● శరవేగంగా సాగుతున్న పనులు


జోరుగా సాగుతున్న నిర్మాణ పనులు


నిర్మాణంలో ఉన్న కారిడార్


గోడలకు పట్టీ పెడుతున్న దృశ్యం

అడయార్, మే 13: చెన్నై మహానగరంలోని పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన వళ్లువర్‌కోట్టం నుంగంబాక్కంలోని లేక్ ఏరియాలో ఉంది. మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి 1970లో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రముఖ శిల్పి గణపతి స్థపతి ఈ వళ్లువర్‌కోట్టం డిజైన్ చేశారు. కన్నియాకుమారిలోని వివేకానంద రాక్‌ఫోర్ట్ వద్ద స్థాపించిన తిరువళ్లువర్ విగ్రహాన్ని కూడా ఈయనే మలిచారు. ఈ ప్రాంగణంలో వున్న రథం ఎంతో గొప్పగా తీర్చిదిద్దారు. ఈ వళ్లువర్‌కోట్టంను 1976లో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. అప్పటి నుంచి నగరంలోని పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడకు వారం రోజుల్లో కనీసం 400 నుంచి 500 మంది, వారాంతపు సెలవు రోజుల్లో వెయ్యి మంది సందర్శకులు వచ్చేవారు. అలాంటి పర్యాటక ప్రాంతం గత ప్రభుత్వ పాలనలో ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఇందులోని అనేక కట్టడాలు కళావిహీనంగా, శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన సీఎం స్టాలిన్, దీనికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రజాపనుల శాఖ అధికారులు గత కొన్ని రోజులుగా మరమ్మతు పనులు చేపట్టారు. మణిమండపానికి రంగులు, తిరువారూరు ఆలయ రథం బొమ్మలు, ప్రహరీ నిర్మాణం, రథానికి ఒక వైపు డబుల్ డెక్కర్ కారు పార్కింగ్, క్యాంటీన్, తిరుక్కురళ్ కళాఖండాలు, బుక్‌స్టాల్స్, తిరుక్కురల్ మణి మండపం నిర్మించే భాగంలో తిరుక్కురల్ 135 చాప్టర్లలోని సూక్తులు అందరికీ కనిపించేలా చేస్తున్నారు. అలాగే, శీతలీకరణ సదుపాయంతో 1400 మంది కూర్చొనే విధంగా ఒక అంతర్జాతీయ ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో అత్యాధునిక సౌండ్, లైటింగ్ పరికరాలను అమర్చుతున్నారు. ఈ ఆధునికీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


నిర్మాణ దశలో ఉన్న వాటర్ ఫౌంటైన్


గోడలకు పెయింటింగ్




గోడలకు ఆధునికీకరణ పనులు

పక్కటెముకల రుగ్మతలకు సిమ్స్‌లో చికిత్సా కేంద్రం



మీడియా సమావేశంలో చికిత్సా కేంద్రం వివరాలు తెలుపుతున్న ఐకాడ్ డైరెక్టర్ డాక్టర్ వీవీ బాషి తదితరులు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో సిమ్స్ ఆస్పత్రిలో పక్కటెముకల రుగ్మతల కోసం ప్రత్యేక చికిత్సా కేంద్రం ఏర్పాటైందని ఆ ఆస్పత్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ అండ్ అయోర్టిక్ డిజార్డర్స్ (ఐకాడ్) హెడ్ డాక్టర్ వీవీ బాషి తెలిపారు. సిమ్స్ ఆస్పత్రిలో సోమవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ఛాతీకి ఏర్పడే గాయాలు, పక్కటెముకల వైకల్యాలను నిరోధించేలా ప్రత్యేక చికిత్స అందిస్తుందని వివరించారు. పక్కటెముకల్లో ఏర్పడే పగుళ్ళకు కూడా తగు చికిత్స అందిస్తుందన్నారు.

కొడైకెనాల్‌లో ప్రారంభమైన 'ప్లమ్స్' పండ్ల సీజన్


పండ్ల సేకరణలో కార్మికులు

పెరంబూర్, మే 13: దిండుగల్ జిల్లా కొడైకెనాల్ కొండ ప్రాంతాల్లో ఆపిల్‌గా పిలువబడే 'ప్లమ్స్' పండ్ల సీజన్ ప్రారంభమైంది. ఈ ప్రాంతాల్లో కొద్ది కాలం క్రితం ప్లమ్స్ చెట్లు పూలు పూయ డం ప్రారంభించాయి. కానీ, శీతోష్ణ స్థితులు మార్పుల కారణంగా గత ఏడాది 50 శాతం మాత్రమే పండ్లు కోతకు వచ్చాయి. ప్రస్తుతం కొడైకెనాల్, విల్‌పట్టి, పల్లంగి, అట్టువంపట్టి, వడకవుంజి తదితర ప్రాంతాల్లో పమ్స్ పండ్ల కోతలు ప్రారంభమయ్యాయి. ఈ పండ్లు మదురై, చెన్నై సహా పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు, వ్యాపారులు తెలిపారు. హోల్‌సేల్‌లో రూ.150కి కొనుగోలు చేస్తుండగా, చిల్లర దుకాణాల్లో రూ.250 వరకు విక్రయమవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

మార్కెట్లోకి సూర్యదేవ్ టీఎంటీ బార్లు


టీఎంటీ బార్లను పరిచయం చేస్తున్న బాలచంద్రన్, సుమన్ అగర్వాల్ తదితరులు

ప్యారీస్, మే 13: సూర్యదేవ్ సంస్థ ఇనుప ఖనిజం బార్లను రాష్ట్ర మార్కెట్లోకి పరిచయం చేసింది. ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం రాగి, క్రోమియం, నికిల్ మిశ్రమంతో తయారుచేసిన ఎఫ్‌ఈ520డి సీఆర్ఎస్ టీఎంటీ బార్లను నగరంలో జరిగిన కార్యక్రమంలో పరిచయం చేసింది. అధిక బలం, ఉన్నతమైన డక్టిలిటీ కలయిక, నివాస, నిర్మాణానికి అనుకూలమైన బార్లు రాష్ట్రంలోని అన్ని హార్డ్‌వేర్ స్టోర్స్‌లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు బాలచంద్రన్, సుమన్ అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, ఎస్ఆర్ఎస్ కృష్ణన్, యశ్‌పాల్‌శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో వృద్ధుడికి హృద్రోగ శస్త్రచికిత్స


హృద్రోగ శస్త్రచికిత్సకు ఉపయోగించిన పరికరాన్ని చూపుతున్న వైద్యనిపుణులు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి) : చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో 77 యేళ్ల వృద్ధుడికి క్యాథెటర్ ఆధారిత హృద్రోగ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్ తెలిపారు. బృహద్ధమని నాళం కుదించుకుపోయి తీవ్ర అస్వస్థతో బాధపడుతున్న ఆ వృద్ధుడికి కృత్రిమ బృహద్ధమని కవాటాన్ని అమర్చినట్లు తెలిపారు. శస్త్రచికిత్స చేసిన వైద్యనిపుణులు అమర్చిన కృత్రిమ కవాటం సఫైన్ 3 అల్ట్రా అని పిలువబడుతోందన్నారు. ఈ శస్త్రచికిత్సకు ఎడ్వర్డ్స్ ఇ-షీత్ అనే సురక్షిత వెంట్రుక వాసి సూదిలాంటి పరికరమని, దాని సాయంతోనే కృత్రిమ బృహద్ధమని కవాటాన్ని అవసరమైన చోట అమర్చినట్లు ఆ ఆస్పత్రి కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ మురళీధరన్ తెలిపారు. శస్త్రచికిత్స జరిగిన మరుసటి రోజే ఆ వృద్ధుడు కోలుకున్నాడని తెలిపారు.


వానలో హాయ్.. హాయ్

● ఊటీలో వర్షంలో తడుస్తూ ఫ్లవర్‌షో తిలకించిన పర్యాటకులు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలో జరుగుతున్న సమ్మర్ సీజన్ ఫలపుష్ప ప్రదర్శనను పర్యాటకులు సోమవారం ఉదయం వర్షంలో తడుస్తూ తిలకించారు. నీలగిరిలో ప్రతియేటా వేసవిలో ఫ్లవర్‌షో నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ నెల 10న ఊటీ బొటానికల్ గార్డెన్ ప్రాంతంలో రోజ్ గార్డెన్ ప్రాంతంలో ఫ్లవర్ షో ప్రారంభమైంది. రెండు రోజులుగా ఊటీలో ఎండలు తగ్గి అప్పుడప్పుడూ జల్లులు కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 60 వేల మంది పర్యాటకులు ఫ్లవర్‌షో తిలకించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా రోజ్ గార్డెన్‌లో కొనసాగుతున్న గులాబీ పూల ప్రదర్శనను మూడురోజుల్లో 25 వేల మంది తిలకించినట్లు తెలిపారు. ఈ ఫ్లవర్‌షో సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల కోసం ఊటీ బస్టాండు నుంచి ఫ్లవర్‌షో ప్రాంతం సహా అన్ని పర్యాటక ప్రాంతాలను తిలకించేలా 20 ట్రిప్పులు ప్రత్యేక బస్సులు కూడా నడుపుతున్నారు. బోట్ హౌస్, పింకర్ పోస్ట్, బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, ఆవిన్ కాంప్లెక్స్, దొడ్డబెట్టా పర్వత శిఖరం తదితర ప్రాంతాలకు ఈ బస్సుల్లో పర్యటిస్తున్నారు. ఇక సోమవారం ఉదయం ఊటీ అంతటా వాన జల్లులు కురిశాయి. పర్యాటకులు వానలోనే తడుస్తూ ఫ్లవర్‌షో, రోజ్ గార్డెన్‌లో ఏర్పాటైన గులాబీ పూల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.


ఊటీ ఫ్లవర్ షోలో పూలతో రూపొందించిన జంతువుల రూపాలను తిలకిస్తున్న పర్యాటకులు


చెన్నై సచివాలయంలో నీటి ఎద్దడి సమస్యపై అధికారులతో చర్చలు జరుపుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా





చెన్నై ఇస్కాన్ సెంటర్‌లో దేవతామూర్తులకు నిర్వహించిన పుష్పాభిషేకం దృశ్యం.. వేడుకల్లో పాల్గొన్న కృష్ణ భక్తులు